## క్లుప్తంగా

### పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని నాగలాపురం గ్రామానికి చెందిన ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు తాలూకా ఎస్‌ఐ ఎర్రిస్వామి తెలిపారు. గ్రామానికి చెందిన పెద్ద ఈరన్నతో పాటు మరో ఐదుగురు గ్రామ సమీపంలోని పొలాల్లో మంగళవారం పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.15,550 నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

### తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వేస్టేషన్‌లో 4 ఏళ్ల బాలుడు మంగళవారం ఉదయం ఏడుస్తూ కూర్చున్నాడు. రైల్వే ఎస్‌ఐ గోపాల్, కానిస్టేబుల్ షేక్షావలి బాలుడిని దగ్గరకు తీసుకున్నారు. పేరు, ఊరు అడుగగా.. తన పేరు సందీప్ అని, కొడలపేట ఆదోని అని తెలిపాడు. ఈ వార్త పట్టణంలోని వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో తండ్రి బోయ మురళీకృష్ణ రైల్వే పోలీసులను సంప్రదించాడు. ఎస్‌ఐ విచారించగా ఉదయం భార్య తాను రైలు దిగి బాలుడిని మరిచి వెళ్లిపోయినట్లు తెలిపాడు. తరువాత బాలుడిని తండ్రికి అప్పగించారు. దీంతో బాలుడి తండ్రి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

### ఘనంగా ఊయల మహోత్సవం

కౌతాళం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన త్రైంబికేశ్వరి ఆలయాన్ని ఈనెల 22వ తేదీన ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజు రాత్రి బసవేశ్వరస్వామి పురాణ ప్రవచనాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి శరణబసవేశ్వర స్వామి పుట్టిన రోజు సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఊయలలో వేసి నామకరణం చేశారు. ముందుగా గ్రామంలో పల్లకీ మహోత్సవం నిర్వహించారు. ముత్తైదువులు కలశాలతో ముందు రాగా పల్లకీ సాగింది. అనంతరం ఊయల మహోత్సవం భక్తుల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రతి రోజూ వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### రేణుకా ఎల్లమ్మకు విశేష పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

కోసిగి: మండల ప్రజల ఆరాధ్య దైవం రేణుకా ఎల్లమ్మ దేవికి భక్తులు విశేష పూజలు చేపట్టారు. మంగళవారం అమ్మవారి పర్వదినం కావడంతో ఆలయ అర్చకులు మల్లికార్జున గౌడ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి అభిషేకం, కుంకుమార్చన, వెండి కవచ అలంకరణ, ఫలపుష్పాలంకరణ గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ నెల 29వ తేదీన ఎల్లమ్మ జాతర పురస్కరించుకుని మహా రథోత్సవం జరుగనుంది. ఈ మేరకు మంగళవారం నుంచి అమ్మవారి పర్వదినాలు ప్రారంభమయ్యాయి. దీంతో జిల్లా నుంచే గాక కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తాదులు తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకురు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.

### ఈవీఎం పనితీరుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదోనిరూరల్: ఈవీఎంల పనితీరుపై బీఎల్‌ఓలకు, సెక్టోరియల్ ఆఫీసర్‌లకు మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలకు విడతలవారీగా 1వ పోలింగ్ కేంద్రం నుంచి 46వ పోలింగ్ కేంద్రంలో ఉన్న బీఎల్‌ఓలకు, సెక్టోరియల్ ఆఫీసర్‌లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరును వివరించారు. ఉప తహసీల్దార్ ఈజాజ్‌అహ్మద్, ఖాసీం పాల్గొన్నారు.

### అయోధ్యకు సైకిల్ యాత్ర

కౌతాళం: కర్ణాటక వాసి రాజన్న అయోధ్య శ్రీరాముడి దర్శనం కోసం సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్ర మంగళవారం రాత్రి కౌతాళం మీదుగా సాగింది. ఇక్కడి శివస్వాములు మంజునాథ్, మనోహర్ తదితరులు రాజన్నను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ.. కర్ణాటకలోని దావణగేరి నుంచి యాత్రకు బయలుదేరినట్లు తెలిపారు. యాత్ర ప్రారంభించి 6 రోజులైందన్నారు. సైకిల్‌పై వెళ్లి అయోధ్య రాముడిని దర్శించుకుంటానని మొక్కుకున్నట్లు తెలిపారు.

# ‘సురక్ష’ సూపర్ సక్సెస్

- రెండవ విడతలుగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం
- వైద్య శిబిరాలకు విశేష స్పందన
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కోసిగి: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం రెండో విడత సురక్ష కార్యక్రమాన్ని వైద్య శాఖ అధికారులు విజయవంతంగా నిర్వహిస్తుండగా వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. ప్రజలు భారీగా తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. మంగళవారం కోసిగి సచివాలయం-3 పరిధిలోని ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాధవరెడ్డి, డాక్టర్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రజల ఆరోగ్య క్షేమాల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఆ సచివాలయం పరిధిలో వివిధ వ్యాధులతో పడుతున్న వారు ఓపీ ద్వారా 513 మంది వైద్యసేవలు పొందారు. ప్రధానంగా రక్త పరీక్ష, డయాబెటీస్, మలేరియా, హెబీ, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. మెరుగైన చికిత్స అవసరమైన ముగ్గురిని ఆరోగ్య శ్రీ కింద కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే ఉచిత కంటి పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందించేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. కోసిగి వైద్యాధికారి డాక్టర్ రజిత, కర్నూలు జనరల్ సర్జన్ వసూధరాణి, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, ఎల్లప్ప, సూపర్‌వైజర్ రాముడు, ఈఓ చంద్రశేఖర్, ఆప్తమాలజిస్ట్ ప్రతాప్ పాల్గొన్నారు.



కోసిగి సచివాలయం-3లో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

### సద్వినియోగం చేసుకోండి



ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారు. మొదటి విడతగా మండలంలోని 19 సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహించి ప్రతి ఇంటికీ తిరిగి పేద ప్రజలకు వైద్య సేవలు అందించాం .అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించాం. మరింత మందికి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్-2 కార్యక్రమం చేపడుతున్నాం. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– మనోజ్‌కుమార్ వైద్యాధికారి, కోసిగి

### బీపీ, షుగర్ పరీక్షలు చేశారు



వైద్యాధికారులు మా కాలనీలో రెండు పార్లు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహించారు. నాకు చాలా ఏళ్లుగా బీపీ, షుగర్ ఉంది. గతంలో నిర్వహించిన శిబిరంలో వైద్యాధికారులు ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. మంగళవారం రెండవ సారి క్యాంప్ నిర్వహించగా షుగర్, బీపీ, చెక్ చేసి మందులు ఇచ్చారు. నాలుగేళ్లుగా ప్రభుత్వ మందులను వాడుతున్నాను. ఆరోగ్య పరంగా చాలా బాగుంది. కాలనీలోనే వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉంది. – ముదగల్లు గిరివాసులు, కోసిగి

### వైద్యసేవలు బాగున్నాయి



వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. వైద్య సేవలు బాగున్నాయి. వైద్య సిబ్బంది ఇంటివద్దకే వచ్చి ఆరోగ్య సలహాలు సూచనలు ఇస్తున్నారు. మా సచివాలయ పరిధిలో రెండవ సారి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహించారు. నాకు బీపీ, షుగర్ ఉండడంతో రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. అలాగే ఉచితంగా కంటి పరీక్ష చేయించుకున్నాను. మందులు ఇచ్చారు. త్వరలో కంటి అద్దాలు ఇస్తామన్నారు. సురక్ష శిబిరాలతో వ్యయప్రయాసలు తప్పాయి.

– నజీర్ అహ్మద్, కోసిగి

### నూతన విద్యావిధానం రద్దుకు సంతకాల సేకరణ



సంతకాలను సేకరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు షాబీర్ బాషా అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల, సాయి కళాశాలలో విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. విద్యారంగంలో మార్పులు తీసుకొస్తామని కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్నే కాషాయకరణ చేయడానికి కుట్ర పన్నుతోందని విమర్శించారు. శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాల్సిన ప్రభుత్వాలు పాఠ్యంశాలలో మత భావజాలాలను ప్రేరేపిస్తోందన్నారు. విద్యావిధానంపై రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆలోచించి తగు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మల్లికార్జున, లక్ష్మీనారాయణ, విష్ణు, రామనాయుడు, ఉమేష్, శివరాజ్, వీరేష్, అశోక్, శివ తదితరులు పాల్గొన్నారు.

### 17న మెగా వైద్య శిబిరం

తుగ్గలి: ఈ నెల 17న పత్తికొండ సాయిబాబా ఆలయం ప్రాంగణంలో కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంపు కో-ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ.. శాంతిరాం కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి, గుండె, కిడ్నీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, రేషన్ కార్డు, ఫొటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వైభవంగా మర్రిస్వామి ఊరేగింపు



ఊరేగింపులో కలశాలతో పాల్గొన్న మహిళలు



భజనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన కృష్ణావధూత స్వామి 49వ వార్షికోత్సవంలో భాగంగా ఆర్లబండ మఠం అధిపతి మర్రిస్వామితాత పల్లకీ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య పల్లకీ మహోత్సవం గ్రామ పురవీధులగుండా మధ్యాహ్నం వరకు సాగింది. మహిళలు కలశాలతో తరలిరాగా పల్లకీ రథం ముందుకుసాగింది. యువకుల కోలాటలు, చిన్నారుల నృత్య విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తెల్లవారుజామున కృష్ణవధూత స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ప్రతి రోజు రాత్రి భగవద్గీత పురాణం ప్రవచనాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివాహం చేసుకున్న వధువుకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి తాళిబొట్టు, మెట్టెలను అందజేశారు. సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారంను మర్రిస్వామితాత వారు శాలువా పూల మాలతో సన్మానించారు. నిర్వాహకులు అయ్యప్ప, నాయకులు వడ్డె రాము పలువురు పాల్గొన్నారు.

### వైద్యశిబిరానికి విశేష స్పందన

ఆదోనిరూరల్: మండలంలోని ధణాపురం గ్రామంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు'ను నిర్వహించారు. ఈ క్యాంపులో 348 మందికి వైద్య పరీక్షలు చేశారు. షుగర్, బీపీ, కంటి జబ్బులు తదితర వాటికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజల నుంచి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో వైద్యులు సాయిస్వరూప్, సుస్మిత, తేజశ్విని, సర్పంచ్ చంద్రశేఖర్, ఏఎన్‌ఎంలు అనిత, ఎంపీటీసీ హనుమయ్య, పంచాయతీ కార్యదర్శి లత పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

## హనుమాన్‌చాలీసాపై ప్రవచనాలు



హనుమాన్ చాలీసా గురించి ప్రసంగిస్తున్న తురియానంద సరస్వతి, ప్రసంగాన్ని వింటున్న భక్తులు

ఆదోనిఅర్బన్: రామాయణంలో ముఖ్యపాత్ర పోషించిన అతి బలవంతుడు ఆంజనేయుడు అని చిన్మయ మిషన్ కడప ఆచార్యులు స్వామి తురియానంద సరస్వతి అన్నారు. మంగళవారం స్థానిక చిన్మయ మిషన్‌లో హనుమాన్‌చాలీసాపై వివరణాత్మక ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. ఆయన ప్రసంగిస్తూ.. రామాయణంలో హనుమాన్ రామునికి చేసిన సహాయ సహకారాలు, లీలలు, యుద్ధాలు, లక్ష్మణ ప్రాణం కోసం సంజీవని తెచ్చిన విషయాలను భక్తులకు వివరించారు. ప్రతిరోజూ హనుమాన్‌చాలీసాను పఠిస్తే వారికి కష్టాలు తొలగి సుఖసంతోషాలతో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో చిన్మయమిషన్ ఇన్‌చార్జి నారాయణ చైతన్య, మిషన్ అధ్యక్షురాలు సుజాతమ్మ, కార్యదర్శి రఘునాథ్ పాల్గొన్నారు. కాగా ఈనెల 18వ తేదీ వరకు హనుమాన్‌చాలీసాపై ప్రసంగాలు జరగనున్నాయి.

## లబ్ధిదారులకే భూమిపై హక్కులు

వెల్దుర్తి(కృష్ణగిరి): దళితుల అభివృద్ధికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కేటాయించిన భూముల క్రయవిక్రయాలు చెల్లవని ఎస్సీ కార్పొరేషన్ ఈఓ విజయలక్ష్మి స్పష్టం చేశారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని వీరన్న గట్టు సమీపాన, రామళ్లకోట వైపు బ్రిడ్జ్ అవతల గల 816, 817 సర్వే నంబర్లలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1982లో పౌల్ట్రీ ఫారాలు, డెయిరీ ఫారాల కొరకు ఎస్సీలకు 6.46 ఎకరాలు మంజూరు చేశారు. ఆ భూములలో లబ్ధిదారులు కోళ్ల ఫారాలు, గేదెల ఫారాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించారు. నష్టాల బారిన పడినవారు ఫారాలు ఎత్తివేశారు. ఇటీవల కొందరు లబ్ధిదారులు ఆ స్థలాలను అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు ఈఓ విజయలక్ష్మి మంగళవారం స్థానిక వీఆర్‌ఓ ప్రసాద్‌తో కలిసి ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇప్పటికీ ఆయా భూములు ఎస్సీ కార్పొరేషన్ పేరిటనే ఉన్నాయని, లబ్ధిదారులు తమ అభివృద్ధికి మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. ఆ స్థలాలను అమ్మడానికి వీలుకాదన్నారు. ఎవరైనా స్థలాన్ని అమ్మినట్లు రుజువైతే తిరిగి కార్పొరేషన్ స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. ప్రస్తుత విచారణ వివరాలు ఉన్నతాధికారులకు నివేదించి, వారి ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.



వీరన్న గట్టు సమీపంలో స్థలాలను పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈఓ విజయలక్ష్మి

### ప్రతిభను మెరుగుపరుచుకోవాలి

మద్దికెర: విద్యార్థులు ప్రతిభను మెరుగుపరుచుకొని ఉన్నతంగా ఎదగాలని ప్రధానోపాధ్యాయులు విజయరాజు అన్నారు. మద్దికెరలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్, రంజిత్‌లు రాష్ట్రస్థాయి సైన్స్ సదస్సుకు ఎంపిక కావడంతో మంగళవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో కర్నూలులో జరిగిన ఇన్‌స్పైర్ సైన్స్ సదస్సులో నమూనా ప్రాజెక్టును ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బెల్లం ఊట ధ్వంసం

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి కొండల్లో మంగళవారం హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్యానాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది నాటుసారా స్థావరాలపై దాడులు చేపట్టారు. కొండల్లో ఉన్న నాటుసారా స్థావరాలను గుర్తించి సారా తయారీ కోసం బిందెల్లో నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం ద్రావణాన్ని, బిందెలను ధ్వంసం చేశారు. కొండల్లో పెద్దఎత్తున సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం నుంచి కొండల్లో గాలించి స్థావరాలను గుర్తించి ధ్వంసం చేశారు. నాటుసారా సేవించడం, విక్రయించడం చేస్తే కఠిన చర్యలు, జైలు శిక్ష తప్పదని ఎస్‌ఐ హెచ్చరించారు.

### రాష్ట్రస్థాయి గిరక బండి పోటీలు

ఆస్పరి: మండలంలోని అట్టెకల్లు గ్రామంలో దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఈనెల 23వ తేదీన రాష్ట్రస్థాయి గిరక బండి పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 20,116, తర్వాతి స్థానాలకు వరుసగా రూ.15,116, రూ.10,116, రూ.8,116, రూ.5,116, రూ.3,116, రూ.2,116, రూ.1,116 నగదు అందించనున్నట్లు చెప్పారు. పాల్గొనే వృషభాల యజమానులు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు సెల్ 91825 37760, 88977 67114 నంబర్లను సంప్రదించాలన్నారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, సారాతో తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి

ఆదోనిరూరల్: మండలంలోని ధణాపురం, నాగనాథనహళ్లిలో అక్రమంగా కర్ణాటక మద్యం, సారాను తరలిస్తున్న ముగ్గురిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. హొళగుంద మండలం నెరణికి గ్రామానికి చెందిన ఆదోని మైలారప్ప, కురువ చలువప్ప, ఆదోని పట్టణం వాల్మీకినగర్‌కు చెందిన బోయ సూర్య అలియాస్ సూరి రెండు మోటార్‌సైకిళ్లపై 90 ఎంఎల్ పరిమాణం గల కర్ణాటక ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 1,728 టెట్రా ప్యాకెట్లు (18 బాక్సులు), 50 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకున్నామని వెల్లడించారు. రెండు మోటార్ సైకిళ్లు, మద్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం, సారాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక పనులు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఐ శ్రీనివాసులు, హెచ్‌సీ రామయ్య, కానిస్టేబుళ్లు నీలకంఠ, కాశీలింగం, కిరణ్‌కుమార్, ఆదోని రూరల్ హెచ్‌సీ నాగరాజు, కానిస్టేబుల్ సుధాకర్ పాల్గొన్నారు.

### కరెంట్‌షాక్‌తో కార్మికుడికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ దివాకర్

ఆలూరు రూరల్: వ్యవసాయ బోరు కనెక్షన్ కోసం తీగలు లాగుతుండగా కరెంట్‌షాక్ తగిలి దివాకర్ అనే విద్యుత్ కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. హత్తిబెళగల్ గ్రామానికి చెందిన దివాకర్ ఆలూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మీటర్ రీడర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం కరిడిగుడ్డం సమీప పొలాల్లో వ్యవసాయ బోరు కనెక్షన్ కోసం విద్యుత్ తీగలు లాగేందుకు కాంట్రాక్టర్ పిలవడంతో దివాకర్ పనికి వెళ్లాడు. మరమ్మతు పనులు చేస్తుండగా 11 కేవీ లైన్ నుంచి విద్యుత్ సరఫరా కావడంతో ఒక్కసారిగా షాక్ తగిలి స్తంభం నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో దివాకర్ వీపు భాగం, కాళ్లు తీవ్రంగా కాలిపోయాయి. క్షతగాత్రుడిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో బళ్లారి ఓపీడీ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

### గడ్డివామి దగ్ధం

హొళగుంద: పెద్దగోనెహాళ్ గ్రామ శివారులోని సుంకులమ్మ ఆలయం పక్కన మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బోయ నెంగి శంకరన్నకు చెందిన గడ్డివాము కాలి బూడిదైంది. దాదాపు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించింది. 10 ట్రాక్టర్ల గడ్డి ఈ ప్రమాదంలో కాలిపోయినట్లు సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కొత్తింటి వెంకటరెడ్డి తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని చెప్పారు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని కోరారు.

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బి.వెంకటేశ్వర్లు అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పాఠశాలలో మంగళవారం విద్యార్థి వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మయ్యను ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆయన అభినందించారు. గతేడాది డిసెంబర్ 20న కర్నూలులో జరిగిన అథ్లెటిక్ షాట్‌పుట్‌లో జి.వెంకటేశ్వర్లు ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగే పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొననున్నట్లు వెల్లడించారు.

### పాఠశాల స్థాయి నుంచే నైపుణ్య శిక్షణ

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పారిశ్రామిక నైపుణ్యం పెంచుకునేలా, ఉద్యోగార్థుల నుంచి ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదిగేలా పాఠశాలల్లో ఈఎండీపీ (ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని కార్యక్రమ జిల్లా కో-ఆర్డినేటర్ గోపాల్ అన్నారు. మండల పరిధిలోని సూదేపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఈఎండీపీ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయిని నాగమణి ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థుల ప్రదర్శనలను ఆయన పరిశీలించి అభినందించారు. హెచ్‌ఎం వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సిద్ధేశ్వరస్వామి జాతరకు అంకురార్పణ

హొళగుంద: మండల కేంద్రంలో ఈ నెల 18న జరిగే సిద్ధేశ్వరస్వామి రథోత్సవం ఇతర కార్యక్రమాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో స్వామి విగ్రహాలకు కంకణధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. సిద్దప్ప, సిద్దమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు, నిర్వాహకులు అనంతరం స్వామి వారికి కంకణధారణ చేశారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారి విరాటమూర్తికి మహామంగళారతి, అభిషేకాలు, నైవేద్య సమర్పణ జరిగాయి. అలాగే ఇతర ప్రత్యేక పూజలతో పాటు మాంగల్య నిశ్చితార్థ కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 18న సిద్ధేశ్వరస్వామి రథోత్సవం, 19న లంకాదహనం, 20న కంకణ విసర్జన కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రాజ పంపన్నగౌడ్ తెలిపారు.